క్లుప్తంగా

సంజీవరెడ్డికి సత్కారం


సంజీవరెడ్డిని సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

కంచరపాలెం: ఢిల్లీలో జరిగిన ఐఎన్‌టీయూసీ 33వ ప్లీనరీలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డిని నేషనల్ పోర్టు ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ మంత్రి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు కొండబాబు నేతృత్వంలో యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు. విశాఖ పోర్ట్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు పీవీ రమణ, కార్యదర్శి ఎస్కే రాజు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసిపూజ


సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలోనూ పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం లెక్కింపు


నగదు లెక్కిస్తున్న సేవా సంఘం సభ్యులు

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల సంపత్ వినాయగర్ ఆలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. 22 రోజులకు రూ.18.04 లక్షలు, 210 మిల్లీ గ్రాముల బంగారం, 95 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ ఫౌండర్ టి.ఆర్.బోళన్ తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారులు బి.వసంత కుమార్ పర్యవేక్షణలో నగదు లెక్కించారు. శివ జ్యోతి, శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, సిబ్బంది జి.గోవిందరెడ్డి, డీఎస్ ప్రసాద్, అప్పలరాజు పాల్గొన్నారు.

డాక్టర్ కూటికుప్పలకు సత్కారం


పుస్తకాన్ని దత్తాత్రేయకు అందజేస్తున్న సూర్యారావు

కంచరపాలెం: అక్షరయాన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం పురస్కరించుకుని పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రముఖ వైద్యనిపుణుడు డాక్టర్ కూటికుప్పల సూర్యారావును సత్కరించారు. ఈ సందర్భంగా కూటికుప్పల రచించిన 'తెలుగు వీర మేలుకో' పుస్తకాన్ని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆవిష్కరించారు. ఈ మేరకు హర్యానా, మహారాష్ట్ర గవర్నర్లు బండారు దత్తాత్రేయ, విద్యాసాగర్‌లు డాక్టర్ కూటికుప్పల సూర్యారావును ఘనంగా సత్కరించారు. మరిన్ని రచనలు చేయాలని ఆకాంక్షించారు.

వంతెనపై వెతలు


వ్యర్థాలతో నిండిన వంతెన ఫుట్‌పాత్

- ఫుట్‌పాత్ శిథిలం
- నేతాజీ వంతెన చుట్టూ వ్యర్థాల డంపింగ్
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు


సిమెంటు పలకలు లేని నేతాజీ వంతెన

కంచరపాలెం : స్థానిక నేతాజీ ఫ్లై వోవర్‌పై అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది. పాదచారులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఫుట్‌పాత్‌ల కింద భాగంలో కేబుల్ వైర్లు వేశారు. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ పలకలు తీసేశారు. పనులు పూర్తయిన తరువాత సిమెంటు దిమ్మలు సక్రమంగా అమర్చకపోవడంతో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కంచరపాలెం నుంచి జ్ఞానాపురానికి వెళ్లే వంతెన ఆఖరు రహదారిలో ఫుట్‌పాత్‌లను ముళ్ల పొదలు ఆక్రమించాయి. ఇంటి వ్యర్థాలు ఫుట్‌పాత్‌లపై వేయడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. వంతెనకు రంగులు వేసి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడు కనిపించడం లేదు. దీంతో ఫ్లై వోవర్ అస్తవ్యస్తంగా మారింది. కంచరపాలెం నుంచి జ్ఞానాపురం వెళ్లే వంతెన ఎఫ్‌సీఐ గిడ్డంగి వద్ద రైల్వే స్థలాల్లో డెబ్రిస్ ఫుట్‌పాత్‌లపై వేస్తున్నారు. వంతెనపై విద్యుత్ లైట్లు సక్రమంగా పనిచేయక పోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత జోన్–5 ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


విరిగిన పూలకుండీలతో వంతెన రహదారి

చర్యలు తీసుకుంటాం



వంతెనపై సమస్యను ఇప్పటికే గుర్తించాం. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించాం. వ్యర్థాలను వంతెన ఫుట్‌పాత్‌లపై వేస్తున్నారు. వ్యర్థాలు డంప్ చేసే వాహనాలు గుర్తించి సీజ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యుత్ లైట్లు వెలిగేలా జీవీఎంసీ అధికారులను ఆదేశించాం. నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభించేలా చూస్తాం. వంతెనను సుందరంగా తీర్చేందుకు కృషి చేస్తాం.

– ఆర్‌జీవీ కృష్ణ, జోనల్ కమిషనర్, జోన్–5, జ్ఞానాపురం

బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాలకు ఏర్పాట్లు

- ఏడాది పాటు ప్రతీ నెల ఈవెంట్లు
- పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రవర్తి


మాట్లాడుతున్న యూజీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రవర్తి

సీతంపేట : డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ఈ ఏడాది స్వర్ణోత్సవాలు జరుపుకోనున్నట్టు యూజీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ జీఎస్‌కే చక్రవర్తి తెలిపారు. కళాశాల సెమినార్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వర్ణోత్సవ వివరాలను ఆయన వెల్లడించారు. 'ది సొసైటీ ఫర్ కాలేజియేట్ ఎడ్యుకేషన్' ఆధ్వర్యంలో 1973లో ఆర్థిక, సామాజిక, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు సహాయం అందించడానికి బుల్లయ్య కళాశాలను స్థాపించడం జరిగిందన్నారు. జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమై డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాల స్థాయికి చేరుకుందన్నారు. ఇదే కళాశాల పూర్వ విద్యార్థులైన డి.వి.సోమయాజులు, చీమలపాటి రవి ఏపీ హైకోర్టు సిట్టింగ్ జడ్జిలుగా ఉన్నారన్నారు. అలాగే ఇండియన్ టీమ్ క్రికెటర్ కె.ఎస్.భరత్, డబ్ల్యూఎస్ గ్లోబల్ సర్వీసెస్ గ్రూప్ సీఈవో కేశవ్ ఆర్ మురుగేష్, సినీ నటి గౌతమి తదితరులు తమ కళాశాలలో చదినవారేనని చెప్పేందుకు గర్వపడుతున్నామన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థులు దుర్గాప్రసాద్, అనిల్‌కుమార్ న్యూజిలాండ్‌లో జరిగిన కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఒక్కొక్కరు మూడు బంగారు పతకాలు సాధించారని ఆనందం వ్యక్తం చేశారు. సే నోటు ప్లాస్టిక్, భూసార పరిరక్షణపై సంపత్‌కుమార్ సైకిల్, బైకు యాత్రలు చేపట్టాడని తెలిపారు. 2022–23కు గాను 'ద స్కిల్ డెవలప్‌మెంట్ లీడర్‌షిప్' అవార్డు తమ కళాశాలకు వచ్చిందన్నారు. ఈ నెల 25, 26 తేదీలలో ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో మెగాజాబ్ ఫెయిర్ జరుగుతుందని తెలిపారు. స్వర్ణోత్సవాలు పురస్కరించుకుని వచ్చే ఏడాది మార్చి 24 వరకు ప్రతి నెలా ఒక ఈవెంట్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.దీపక్ చౌదరి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో మహిళ సత్తా


నిర్వాహకుల నుంచి బంగారు పతకం అందుకుంటున్న అరుణ

మురళీనగర్: ఇటీవల హర్యానా రాష్ట్రం కురుక్షేత్రలోని ద్రోణాచార్య స్టేడియంలో నిర్వహించిన నాల్గవ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2023లో మురళీనగర్ మహిళ సత్తా చాటారు. ఈ ప్రాంతానికి చెందిన కె.అరుణ 40 ప్లస్ విభాగంలో 400 మీటర్ల హర్డిల్స్ స్వర్ణ పతకం, 400 రిలే పరుగులో తృతీయ బహుమతి సాధించారు. ఈమేరకు ఆమెను వాకర్స్ క్లబ్ సభ్యులు అభినందించారు.

గ్రీన్ బెల్ట్ శుభ్రం


జేసీబీతో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

సీతంపేట: నగరంలో మార్చి నెలలో జరగనున్న జీ–20 సదస్సు పురస్కరించుకుని బ్యూటిఫికేషన్ పనులు జోరుగా జరుగుతున్నాయి. గురుద్వారా కూడలి నుంచి సత్యం కూడలి వరకు హైవేకు అనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని జేసీబీల సాయంతో శుభ్రం చేశారు. చెత్తా, చెదారం, డెబ్రిస్ తొలగించి శుభ్రం చేశారు. చాలా ఏళ్లుగా గ్రీన్‌బెల్ట్‌కు రక్షణగా ఉన్న ఇనుప కంచె శిథిలం కావడంతో కొత్తగా కంచె ఏర్పాటు చేస్తామని సిబ్బంది తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మద్రిపాలెం: జోన్ 2 ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు తెలిపారు. 33–11 కేవీ మాధవధార 1,2 ఎయిర్ పోర్టు, జర్నలిస్టుకాలనీ, రాజీవ్‌నగర్, 11 కేవీ గ్రీన్ గార్డెన్స్ ఫీడర్ల నిర్వహణలో భాగంగా మాధవధార వుడా కాలనీ, కనకమహాలక్ష్మి టెంపుల్‌రోడ్, శ్రీశాంతి మార్క్ ఏరియా, విజేత మార్ట్ ఏరియా, మాధవధార, అంబేడ్కర్ కాలనీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏరియా, అంబేడ్కర్ నగర్, రాంనగర్ కాలనీ, సాయినగర్, జాకీర్ హుస్సేన్‌నగర్, పార్వతీనగర్, నరేంద్రనగర్, మహాత్మాకాలనీ పార్క్, వంశీనగర్, జీబీఎస్ ఏరియా, వుడా అపార్ట్‌మెంట్స్, గంగాగోదావరి అపార్ట్ మెంట్స్, అప్పయ్యనగర్, నరేంద్రనగర్, పార్వతీనగర్, సాయిరాంనగర్, అన్న క్యాంటిన్ ఏరియా, సంపత్ రెసిడెన్సీ, గ్రీన్‌గార్డెన్స్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అక్కయ్యపాలెం పరిధిలో...

సీతంపేట: అక్కయ్యపాలెం 11 కేవీ సెక్షన్ పరిధిలో హెచ్‌టీ లైన్లు నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ జి.సత్యనారాయణ తెలిపారు. అబిద్‌నగర్, అబిద్‌నగర్ పార్కు, షాదీఖానా, బీఎండబ్ల్యూ షోరూమ్ మెయిన్‌రోడ్, అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్ (బాబా టెంపుల్ దరి) ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆశీలమెట్ట సెక్షన్ పరిధిలో..

సీతమ్మధార : ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధి–1 కేవీ పీఅండ్‌టీ కాలనీ ఫీడర్, 11 కేవీ వుడా చిల్డ్రన్ పార్కు ఫీడర్ పరిధిలోని విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం ఉంటుందని జోన్–1 ఈఈ జి.సత్యనారాయణ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, సత్యం జంక్షన్, తహసీల్దార్ కార్యాలయం ఏరియా, ఏఎస్ఆర్ నగర్, డబుల్ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా పద్య సంకీర్తనం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్త ఆధ్వర్యంలో బమ్మెర పోతనామాత్యుని భాగవత ఆణిముత్యాలు పద్య సంకీర్తనం గురువారం నగరంలో ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ తెలుగు భాషా ఉత్సవాలు–2023లో భాగంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం–తెలుగు ప్రాశస్త్యం అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రథమంగా ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోతనామాత్యునిగా డాక్టర్ మూర్తి రేమెళ్ళ తాళపత్రాలను చేతపట్టి ఘంటంతో రాస్తూ పుర వీధుల్లో నడిచిన విధానం నగర ప్రజలను ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఈ విధంగా ఆయన ముందు నడవగా భాగవత ఆణిముత్యాల బృందం పద్య పఠనం చేస్తూ అనుసరించింది. ఆంధ్ర విశ్వకళాపరిషత్ ప్రధాన ద్వారం వద్ద ప్రారంభమైన పద్య సంకీర్తనం సిరిపురం ప్రధాన కూడలి మీదుగా తెలుగు విభాగం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య జి.యోహానుబాబు, డాక్టర్ బూసి వెంకటస్వామి, పూర్ణిమా రేమెళ్ళ, వెంకటేశ్వరరావు, డాక్టర్ జె.కె.కిషోర్, సి.వి.హెచ్.ఎస్.శర్మ, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో అందుబాటులో కొత్త చింతపండు


జీసీసీ స్టాల్‌లో వినియోగదారులకు కొత్త చింతపండు ప్యాకెట్ అందిస్తున్న ఈవో ప్రసాద్

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో కొత్త చింతపండు అందుబాటులోకి వచ్చింది. ఇంతవరకు ఇక్కడ రైతులు విక్రయిస్తున్న ధర కంటే దీని ధర అధికారులు తక్కువగా నిర్ణయించారు. బజార్‌లో ఏర్పాటు చేసిన జీసీసీ స్టాల్‌లో గురువారం నుంచి కొత్త చింతపండు విక్రయాలు ప్రారంభించారు. పిక్కతో 3 కిలోలు, 5 కిలోల చొప్పున ప్యాకెట్లుగా చేసి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ఇక్కడ 3 కిలోల చింతపండు ప్యాకెట్ రూ.130, 5 కిలోల చింతపండు ప్యాకెట్ రూ.210గా ధర నిర్ణయించారు. రైతులు విక్రయిస్తున్న చింత పండు కిలో రూ.72 ఉంది. దీంతో వినియోగదారులు జీసీసీ స్టాల్‌లో చింతపండు కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు ఇక్కడ రైతులు విక్రయించే ధర తగ్గే అవకాశం ఉందని వినియోగదారులు, రైతుబజార్ సిబ్బంది భావిస్తున్నారు. ఈ సందర్భంగా ఈవో ప్రసాద్ మాట్లాడుతూ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజయ వంట నూనె ధరలు ఇలా..

చింతపండుతో పాటు ఇక్కడ ప్రత్యేక కౌంటర్‌లో విజయ వంట నూనెలను అందుబాటులో ఉంచారు. సన్ ఫ్లవర్ నూనె లీటర్ రూ.130, పామాయిల్ లీటర్ రూ.103, వేరు శనగ నూనె లీటర్ రూ.178, రైస్ బ్రౌన్ ఆయిల్ లీటర్ రూ.121 విక్రయిస్తున్నట్లు రైతుబజార్ ఈవో ప్రసాద్ తెలిపారు. ఇక్కడ నూనెలు బయట ధరల కంటే తక్కువగా ఉంటాయన్నారు.

ఎరుకమాంబ అమ్మవారికి సారె


అమ్మవారి పాదాల చెంత సారె

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకమాంబ అమ్మవారికి స్థానికులు తొలిసారిగా సారె పెట్టారు. స్థానిక మహిళలు అరిసెలు, చలివిడితో పాటు పలు రకాల స్వీట్లను నెత్తిన పెట్టుకుని పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి నివేదించి పసుపు కుంకుమతో పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. కార్యనిర్వాహణాధికారి రమాబాబు, అర్చకుడు శ్రీనివాసరావు పూజలు చేశారు.


అమ్మవారి సారె వీధుల్లో ఊరేగిస్తున్న మహిళలు

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకుందాం


మాట్లాడుతున్న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు సారిపిల్లి గోవింద్

సీతంపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజు సుధాకర్ గెలుపునకు సమష్టిగా పని చెయ్యాలని 25వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు సారిపిల్లి గోవింద్ అన్నారు. ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సూచనల మేరకు గురువారం సీతంపేటలోని ఒక హోటల్‌లో వార్డు కన్వీనర్లు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 13న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన మురుగు


అల్లూరి విగ్రహం రోడ్డుపై మురుగు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 14 వార్డులోని పలు ప్రాంతాలలో మ్యాన్ హోల్స్ పొంగిపొర్లుతోంది. రహదారులపైకి మురుగు చేరుతోంది. యూజీడీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. ప్రతి రోజు ఎక్కడో ఒక చోట ఇలా మ్యాన్ హోల్ లీకవుతున్నా జీవీఎంసీ యూజీడీ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు విగ్రహం సమీపంలో రహదారిపై మురుగు చేరడంతో దుర్వాసన వెదజల్లుతోంది. స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా శానిటరీ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్స్ పొంగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రహదారి సుందరీకరణ పనుల పరిశీలన


అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ రాజాబాబు

మద్రిపాలెం: వచ్చే నెలలో జరగనున్న జీ–20 సదస్సు నేపథ్యంలో నగర సుందరీకరణ పనులను జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు గురువారం పరిశీలించారు. జాతీయ రహదారి ఆధునికీకరణ పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్ఏడీ నుంచి బిర్లా కూడలి వరకు పర్యటించారు. ఈ సందర్భంగా రహదారికి ఆనుకుని ఉన్న ప్రాంతాలను తెలిపే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారికిరువైపులా పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించాలని, విద్యుత్ పనులు, చెట్లు, గోడలకు ఉన్న ప్రకటనల బోర్డులు, కేబుల్ వైర్లు, పోస్టర్లు తొలగించి శుభ్రం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. బస్‌స్టాప్‌లను ఆధునీకీకరించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. రహదారి మొత్తం గ్రీనరీతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్నారు. రోడ్డుపక్కన గోడలు, నడకదారులను మరమ్మత్తులు చేపట్టి రంగులు వేయాలన్నారు. జీ–20 సదస్సుకు వివిధ దేశాల ప్రతినిధులు రానున్న నేపథ్యంలో పారిశుధ్య కార్మికులు మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. ఎక్కడ వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ సన్యాసిరావు, పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్ కుమార్, డీడీ (హార్టీకల్చర్) ఎం.దామోదరరావు, జోనల్ కమిషనర్లు మల్లయ్య నాయుడు, ఆర్‌జీవీ కృష్ణ, పర్యవేక్షణ ఇంజినీర్లు వేణుగోపాలరావు, రామ్మోహన్‌రావు, డీసీపీ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ ఆటపరికరాల వితరణ


చెస్, క్యారమ్స్ పరికరాలను విద్యార్థులకు అందిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

మురళీనగర్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించేందుకు మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు ఆట పరికరాలను గురువారం అందించారు.

ఈ మేరకు బర్మా క్యాంపు జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు ఇండోర్ గేమ్స్‌లో పాల్గొనే విధంగా అవసరమైన క్యారమ్స్, చెస్ బోర్డులను అందించారు. దీంతో పాటు వ్యాయామ సమయంలో వినియోగానికి అవసరమైన కార్డ్‌లెస్ మైక్‌ను పాఠశాల హెచ్‌ఎం సాయి లక్ష్మికి అందించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ స్వరూప రాణి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, ఎస్.పుష్పలత, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి, ఉపాధ్యక్షురాలు జి.వరలక్ష్మి, సంయుక్త కార్యదర్శి ఎ.జయశ్రీ, ఎ.లక్ష్మి పాల్గొన్నారు. యోగా టీచర్ ఎం.శేషామణి విద్యార్థులతో యోగా చేయించారు. యోగాసనాలపై ఉచితంగా శిక్షణనిస్తామని ఆమె చెప్పారు.

అలరించిన సినీ సంగీత విభావరి


పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట: సాంస్కృతిక రాజధానిగా రూపుదాల్చిన విశాఖలో దివికేగిన సినీ దిగ్గజాల స్మారకార్థం సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చెయ్యడం అభినందనీయమని గీతం విశ్వవిద్యాలయం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ అన్నారు. ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం విశాఖ పౌరగ్రంథాలయంలో కళాతపస్వి కె.విశ్వనాథ్, నేపథ్యగాయనీ వాణీ జయరామ్‌ల స్మారకార్థం సంగీత సాహిత్య సమలంకృతే శీర్షికన నిర్వహించిన సినీ సంగీత విభావరికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత ఎస్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు భాషా విలువలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు కె.విశ్వనాథ్ అని.. జాతీయ స్థాయి గుర్తింపు పొందిన వాణీ జయరామ్‌లు సినీ ప్రపంచానికి దూరం కావడం విచారకరమన్నారు. ఈ సందర్భంగా రమేష్ పట్నాయక్, శ్రీవిద్య పాడిన అందెల రవమిది, శంబర జోగారావు శైలజ పాడిన రేపల్లియ యెద ఝల్లున పొంగిన రవళి, వీకే రాజు శృతి పాడిన రాగాల పల్లకిలో, రాజేంద్రప్రసాద్, కల్యాణి పాడిన ఒక పూల బాణం పాటలు ప్రేక్షకులను అలరించాయి. పాడుతా తీయగా విన్నర్ సార్థక్, లక్ష్మీశైలజ, పి.ఎల్.నాయుడు, కోసూరు రాజు, దీప్తి పలు హిట్‌సాంగ్స్ పాడి వీనుల విందుచేశారు. ఈ కార్యక్రమంలో ఆత్రేయ స్మారక కళా పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి, పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, వైభవ్ జ్యూలర్స్ అధినేత్రి గ్రంధి మల్లిక, వ్యాపారవేత్త పువ్వాడ శోభన్ ప్రకాష్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కళా సంస్థల ప్రతినిధులు చెన్నా తిరుమలరావు, సన్‌మూర్తి, ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

బైకు ఢీకొని చిన్నారికి గాయాలు

మద్రిపాలెం: స్కూల్‌కి వెళ్తున్న ఓ చిన్నారిని బైకు ఢీకొన్న ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా..ఐటీఐ జంక్షన్ వద్ద సుభాష్ నగర్‌కు చెందిన చందు అనే ఒక బాలుడు గురువారం ఉదయం స్కూల్‌కి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా అదే సమయంలో కంచరపాలెం వైపు బైకుపై వెళ్తున్న ఓ వ్యక్తి ఢీకొన్నాడు. దీంతో చందు ఎడమకాలు ఫ్రాక్చర్ అయ్యింది. బాలుడి తల్లి వేలంగిని పోలీసులకు గురువారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.